క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సమావేశం

కందుకూరు: ఎంపీపీ మంద జ్యోతి ఆధ్వర్యంలో ఈనెల 25న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే మీటింగ్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

చీరల పంపిణీ



పారిశుద్ధ్య సిబ్బందికి చీరలను పంపిణీ చేస్తున్న కృష్ణ

బడంగ్‌పేట్: మాజీ హోంమంత్రి పట్లోళ్ల ఇంద్రారెడ్డి వర్ధంతిని శనివారం రాత్రి బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 50మంది పారిశుద్ధ్య సిబ్బందికి చీరలు, పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ యువజన విభాగం అధ్యక్షుడు చిత్రం సాయి, నర్సింగ్ తదితరులున్నారు.

మంత్రి చొరవతోనే అభివృద్ధి



మైక్‌సెట్ అందజేస్తున్న నరేందర్‌గౌడ్

పహాడీషరీఫ్: విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి చొరవతో నియోజకవర్గంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షుడు నిమ్మల నరేందర్‌గౌడ్ అన్నారు. రంగనాయకుల కాలనీలో రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన మరాఠి భవన్ బుద్ధ విహార్‌లో 12వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఇరగొట్టి కృష్ణ సొంతంగా సమకూర్చిన మైక్‌సెట్‌ను నిమ్మల నరేందర్‌గౌడ్ నిర్వాహకులకు ఆదివారం అందజేశారు. సీసీ కెమెరాలు తన సొంతంగా ఏర్పాటు చేయిస్తానని ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గండికోట రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభచాటిన లార్డ్స్ విద్యార్థులు



సర్టిఫికెట్లతో లార్డ్స్ విద్యార్థులు

బడంగ్‌పేట్: ఇబ్రహీంపట్నంలోని శ్రీనేచర్ వల్లీ రిసార్ట్‌లో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే బెల్ట్ పరీక్షల్లో లార్డ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అంతర్జాతీయ గ్రాండ్‌మాస్టర్, జపాన్ దేశానికి చెందిన సంకుకై చేతులమీదుగా విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ నరేందర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'నాదర్‌గుల్ కింగ్స్'



ట్రోఫీతో నాదర్‌గుల్ కింగ్స్ ఎలెవెన్ జట్టు

బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో నిర్వహించిన ప్రీమియర్ సీజన్– 5 క్రికెట్ టోర్నమెంట్‌లో నాదర్‌గుల్ కింగ్స్ ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నాదర్‌గుల్ సూపర్ కింగ్స్ టీమ్‌తో తలపడింది. విజేత జట్టుకు రూ.55.555, ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన టీమ్‌కు రూ.33,333 ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో ముద్దం వెంకట్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, జైపాల్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, గ్రామ పెద్దలు 8 టీంల ఫ్రాంచైజీలు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

ఎన్‌ఎస్‌యూ మండల అధ్యక్షుడు ఫరీద్

ఆమనగల్లు: సీఎం హామీలను అమలు చేయనందున సోమవారం కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఎన్‌ఎస్‌యూ మండల అధ్యక్షుడు ఫరీద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు పట్టణంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ఆమనగల్లులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాల, ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. హామీ ఇచ్చి ఐదేళ్లు కావస్తున్నా ఏ ఒక్క హామీ అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తున్నామని చెప్పారు.

రోడ్లు వేశారు.. లింకు మరిచారు!



గుట్టను తొలిచి నిర్మించిన రహదారి



మైసమ్మ ఆలయం వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు ఇదే

- వాహనదారులకు తప్పని దూర భారం
- ఫ్లైఓవర్ నిర్మించాలని అభ్యర్థన

పహాడీషరీఫ్: దుర్గానగర్ చౌరస్తా(ఒరంగడ్డ) నుంచి తుక్కుగూడ హైవేకు అనుసంధానం చేస్తూ వేసిన రోడ్డులో చిన్న లింక్‌ను పూర్తి చేయకపోవడంతో ఏళ్ల తరబడిగా వాహనదారులకు దూర భారం తప్పడం లేదు. ఒరంగడ్డ నుంచి నేరుగా లక్ష్మీగూడ, వాంబే కాలనీ, శ్రీరాం కాలనీ, జల్‌పల్లి మీదుగా మామిడిపల్లి వరకు 150 ఫీట్ల విస్తీర్ణంతో 2007లో కార్గో రోడ్డును పూర్తి చేశారు. జల్‌పల్లి నుంచి మామిడిపల్లి మార్గంలో కార్గో రోడ్డు నుంచి బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం మీదుగా తుక్కుగూడ హైవేకు మరో మార్గం వేశారు. ఈ రూట్‌లో కార్గో రోడ్డు నుంచి ఈర్లగండి మైసమ్మ ఆలయం వరకు దాదాపు 750 మీటర్లు పొడవు.. తిరిగి గుట్ట పైనుంచి తుక్కుగూడ హైవేకు దాదాపు మూడు కిలోమీటర్ల మేర అప్పట్లోనే రోడ్డు పనులను పూర్తి చేశారు. కానీ మైసమ్మ ఆలయం వద్ద గుట్టపైకి రహదారి నిర్మించకపోవడంతో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్డు నిరుపయోగంగా మారింది.

కొండను పిండినా..

నూతన రహదారి నిర్మాణంలో భాగంగానే పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్– దేవేందర్‌నగర్, రంగనాయకుల కాలనీ మీదుగా ఉన్న భారీ గుట్టను తొలిచి మామిడిపల్లి మైసమ్మ ఆలయం వరకు రహదారిని నిర్మించారు. ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేశారు. ఇంత వ్యయప్రయాసలకు ఓర్చిన అధికారులు 250 మీటర్ల లింకును మాత్రం పట్టించుకోవడం లేదు. మైసమ్మ ఆలయ చౌరస్తా వద్ద పహాడీషరీఫ్– మామిడిపల్లి రోడ్డుకు ఇబ్బంది లేకుండా.. నేరుగా గుట్టపైకి ఫ్లైఓవర్ వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానం

ఒరంగడ్డ నుంచి ఎయిర్‌పోర్ట్‌కు పి– 7 కార్గో రోడ్డును ప్రతిపాదించి 2007లో మామిడిపల్లి వివేకానంద విగ్రహం వరకు మాత్రమే పూర్తి చేసిన అధికారులు.. తాజాగా ఎయిర్‌పోర్ట్‌కు రోడ్డును అనుసంధానం చేస్తున్నారు. రూ.29.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ రహదారి నిర్మాణ పనులకు ఈ నెల 18న మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన సైతం చేశారు. దీని మాదిరిగానే మైసమ్మ ఆలయం వద్ద మిగిలిన చిన్న పాటి లింకును కూడా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణమే పరిష్కారం



కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రహదారిలో చిన్న లింకును పూర్తి చేయకపోవడం సరైంది కాదు. మైసమ్మ ఆలయం వద్ద గుట్ట పైకి ఫ్లైఓవర్‌ను వేసినట్లయితే ఈ రూట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. మామిడిపల్లి గుట్టలలో పెద్ద ఎత్తున ఐటీ కంపెనీలు వస్తున్న నేపథ్యంలో రెండేళ్ల నుంచి ఎన్నో రహదారులను నిర్మించిన అధికారులు ఈ చిన్న లింకును పూర్తి చేస్తే వాహనదారులకు ఎంతో వెసులుబాటుగా ఉంటుంది.

– సురేష్ కుమార్, మామిడిపల్లి

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- మేయర్ చిగురింత పారిజాత
- శ్రీవిద్య టౌన్‌షిప్ కాలనీలో సీసీ కెమెరాల ప్రారంభం

బడంగ్‌పేట్: నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపునకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని మేయర్ చిగురింత పారిజాత అన్నారు. 31వ డివిజన్‌లోని శ్రీవిద్య టౌన్‌షిప్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇంటింటికీ నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలను కట్టడి చేయొచ్చని తెలిపారు. కాలనీల్లో బిగించిన కెమెరాలను సంబంధిత పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేస్తే బాగుంటుందన్నారు. అనంతరం డివిజన్‌లోని గ్రీన్‌రిచ్ కాలనీలో పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, బాలునాయక్, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, సహకార బ్యాంక్ వైస్ చైర్మన్ కొలన్ తిరుపతి రెడ్డి, నాయకులు ఎర్ర జైహింద్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నారాయణగౌడ్, రవిందర్‌రెడ్డి, మనోహర్, శ్రీనివాస్, రాముగౌడ్, రాజేందర్‌రెడ్డి, యాదయ్య, నరహరిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



మేయర్ పారిజాతను సన్మానిస్తున్న కాలనీవాసులు

గోదాం నిర్మాణంతో రైతులకు మేలు

ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

తలకొండపల్లి: గోదాంల నిర్మాణంతో రైతులకు మేలు చేకూరుతుందని ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని చంద్రధనలో విలేకరులతో మాట్లాడుతూ.. మండల కేంద్రంలో గోదాం నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.75లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ నిధులతో వెయ్యి మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాం నిర్మించనున్నట్లు చెప్పారు. గోదాంలో ధాన్యం నిల్వ చేసుకుని మార్కెట్‌లో ధర ఉన్నప్పుడే అమ్ముకునే వీలుంటుందన్నారు. దళారులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదన్నారు.

వచ్చేది బీజేపీ ప్రభుత్వమే

- బీఆర్‌ఎస్ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం
- కార్పొరేటర్ శ్రీవాణి
- చేవెళ్ల సభకు తరలిన కమలం నేతలు

హుడాకాంప్లెక్స్: చేవెళ్లలో ఆదివారం నిర్వహించిన విజయ సంకల్ప సభకు సరూర్‌నగర్ డివిజన్ బీజేపీ నేతలు భారీగా తరలివెళ్లారు. కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీరి అవినీతిని బయటకు లాగుతామని స్పష్టంచేశారు. సభకు తరలిన వారిలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బేగరబోయిన సురేష్ కుమార్, నాయకులు ఆకుల అంజన్‌కుమార్, ఘంటి కిరణ్‌కుమార్, నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.



హుడాకాంప్లెక్స్: అమిత్‌షా సభకు వెళ్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, బీజేపీ నాయకులు

సభకు తరలిన బీజేపీ శ్రేణులు

తుక్కుగూడ: చేవెళ్ల పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు తుక్కుగూడ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. వీరిలో ఆపార్టీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

బీజేపీ వ్యాఖ్యలు అర్థరహితం

- మంత్రి చేసిన అభివృద్ధి కనిపించడం లేదా..?
- మతిభ్రమించినట్లు మాట్లాడితే సహించేది లేదు బీఆర్‌ఎస్ నేతలు

మహేశ్వరం: మంత్రి సబితారెడ్డిపై బీజేపీ నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వట్టెల మల్లేశ్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవతో మహేశ్వరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఇది చూసి ఓర్వలేక చవకబారు ఆరోపణలు చేయడం ఏమిటని మండిపడ్డారు. బీజేపీ నుంచి మహేశ్వరం టికెట్ తనకు రాదని భావిస్తున్న శ్రీరాములు ఆత్మస్థైర్యం కోల్పోయి ఏదేదో మాట్లాడుతున్నాడని, ఇలాంటివి సహించేది లేదని హెచ్చరించారు. మహేశ్వరం మండలంలో రూ.6 కోట్ల నిధులతో 30 పడకల ఆస్పత్రి నూతన భవనం, ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్, పాలిటెక్నిక్, డైట్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాల అదనపు భవనాల నిర్మాణం, రూ.3 కోట్లకు పైగా నిధులతో మోడల్ స్కూల్ అదనపు భవనాల నిర్మాణం, రూ.14.20 కోట్లతో తుమ్మలూరు గేటు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణం, రూ.15.30 కోట్లతో మన్సాన్‌పల్లి– కొళ్లపడకల్ వయా ఘట్టుపల్లి డబుల్ రోడ్డు నిర్మాణం, రూ.9.40 కోట్లతో తండాలు– గ్రామాలను కలిపే బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు, మహేశ్వరం గేటు నుంచి మహేశ్వరం మండల కేంద్రం వరకు రూ.5.20 కోట్లతో నాలుగు వరుసల బీటీ రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, రూ.15 కోట్లతో నాగారం– కొళ్లపడకల్ వయా మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణాలకు మంత్రి సబితారెడ్డి నిధులు తీసుకొచ్చారని తెలిపారు. ఇవే కాకుండా మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, డివిజన్లలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారని స్పష్టంచేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహేశ్వరం గడ్డపైన గులాబీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ స్వర్ణగంటి ఆనందం, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి, మహేశ్వరం మాజీ సర్పంచ్ కూన యాదయ్య, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరిగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చంద్రయ్య, అంధ్యానాయక్, తొంట రవీందర్, దేవులానాయక్, కృష్ణ, ఆనంద్, చందు పలువురు పాల్గొన్నారు.



మహేశ్వరం: మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

హాస్యాస్పదం..

మీర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి సబితారెడ్డి పెద్ద మొత్తంలో నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తుండగా.. బీజేపీ నేతలు మాట్లాడుతున్న తీరు హాస్యాస్పదంగా ఉందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ అన్నారు. మీర్‌పేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే మంత్రి సబితారెడ్డి రూ.6 కోట్ల ప్రతిపాదనలు పంపగా, పరిపాలనా అనుమతులు కూడా ఇచ్చినట్లు స్పష్టం చేశారు. బీజేపీ నాయకుడు శ్రీరాములు యాదవ్‌కు అభివృద్ధి, నిధులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. విద్యాశాఖ, హెచ్‌ఎంఏడీ, ఇతర శాఖల నుంచి మంత్రి కోట్లాది రూపాయల నిధులు తెచ్చారని మరో నేత కామేశ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు బేర బాలకిషన్, రామిడి రాంరెడ్డి, ఎం.దీప్‌లాల్‌చౌహాన్, సిరూర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

మీర్‌పేట: చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998– 99 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆదివారం మీర్‌పేట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒక్కచోటకు చేరిన పాత మిత్రులు గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముకుంద రెడ్డి, అశోకవర్ధన్‌రెడ్డి, చంద్రకాంత్, పాండురంగారెడ్డి, బలరాం, ప్రేమకర్, అనిత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

500 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు



అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న వీరేందర్‌గౌడ్

తుక్కుగూడ: మాజీ హోంశాఖ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం దేవేందర్ విద్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తన తండ్రి పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన జాబ్‌మేళాకు నిరుద్యోగులు, యువత నుంచి మంచి వచ్చిందని తెలిపారు. మేళాకు వచ్చిన 64 సంస్థల్లో సుమారు 1,500 మంది అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు లభించాయని వెల్లడించారు. ఆదివారం 500 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్‌రెడ్డి, దేవేందర్ ఫౌండేషన్ సభ్యులు, ఆయా కంపెనీల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



రేపు బీఆర్‌ఎస్ ప్లీనరీ



కందుకూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

- పార్టీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్
- మంత్రి సబితారెడ్డి హాజరవుతారని వెల్లడి

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్డులో మంగళవారం బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ స్థాయి ప్లీనరీ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ తుక్కుగూడ పట్టణ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ తెలిపారు. ఆదివారం తుక్కుగూడలో ఆపార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ, మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్ స్థాయిల పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. మంత్రి సబితారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారని తెలిపారు. ఆమె ఆధ్వర్యంలో నిర్వహించే ప్లీనరీకి అని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుమన్, యువజన విభాగం అధ్యక్షుడు సామెల్ రాజు, నాయకులు పి.సురేష్, ఉప్పునూతల శ్రీనివాస్, జి.నర్సింగ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశానికి తరలిరండి

కందుకూరు: సుల్తాన్‌పూర్ ఆర్‌సీఐ రోడ్డులో మంగళవారం నిర్వహించనున్న బీఆర్‌ఎస్ నియోజవకర్గ స్థాయి సమావేశానికి తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానుందని మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి పార్టీ సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, జి.సామయ్య, పాండురంగారెడ్డి, సదానంద్‌గౌడ్, ఆనంద్, కృష్ణారెడ్డి, ప్రశాష్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కోరారు. దేశంలో పంచాయితీ రాజ్ వ్యవస్థ పటిష్టంగా అమలవుతోందని ఆయన చెప్పారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో ఆదివారం గౌతమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచాయితీ రాజ్ వ్యవస్థపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీరాజ్ వ్యవస్థపై రూపొందించిన పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకుముందు ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను గౌతమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో మూడంచల పంచాయితీరాజ్ వ్యవస్థ అమలవుతోందని చెప్పారు. పంచాయితీరాజ్ వ్యవస్థ పటిష్టత కారణంగానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో స్థానిక సంస్థలు ఎనలేని కృషి చేస్తున్నాయని ఆయన వివరించారు. భారతదేశం యొక్క ఆత్మ పల్లెలలోనే ఉందని జాతిపిత మహాత్మాగాంధీ చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అనురాధ, జర్పుల దశరథ్‌నాయక్, ఆమనగల్లు వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు దోనాదుల కుమార్, లచ్చిరాంనాయక్, సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, శంకర్, లలిత జోతయ్య, లక్ష్మణ్, తులసీరాంనాయక్, శ్రీనయ్య, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎల్‌ఎస్‌రెడ్డి, గౌతమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి రజినీకాంత్, సభ్యులు రవీందర్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాసులు, కిరణ్, రమేశ్, గణేశ్, సాయికుమార్, పరశురాం, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తదితరులు